# రాజన్నను దర్శించుకున్న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



గౌతమికి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబర్ 16 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి వారిని శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ వారికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, వేములవాడ ఎంఆర్వో మహేశ్ కుమార్, ఆర్ఐ సతీశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# వినియోగదారుల మెప్పు పొందాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి



వేములవాడలో రాజన్న మందుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ, డిసెంబర్ 16 : వ్యాపారులు వినియోగదారుల మెప్పు పొందినప్పుడే పురోగతి ఉంటుందని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. శనివారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలోని సువిధ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన రాజన్న మందుల దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. ఇక్కడ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, బింగి మహేశ్, నరాల శేఖర్, గోలి మహేశ్, నాయకులు రామతీర్థపు రాజు, కొండ కనకయ్య, దుకాణ యజమానులు అనిల్, గంగరాజు, సాయి, లావణ్య తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబానికి గల్ఫ్ కార్మికుల చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట, డిసెంబర్ 16: మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన బొడ్డు బాబు ఇటీవల బెహరాన్ దేశంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి తోటి గల్ఫ్ కార్మికులు చేయూతనందించారు. గ్రామంలో నుంచి వివిధ దేశాలకు వెళ్లిన కార్మికులు గొల్లపల్లి రవీందర్, కత్తి గంగరాజు, దొంతరవేణి శ్రీకాంత్, పుల్లూరి సతీశ్, ఎండీ బాబు, సయ్యద్ రకీమ్, పుల్లూరి ప్రేమ్‌చంద్, కర్నాల వెంకటేశ్, కర్నాల అజయ్, గణేశ్, అనిల్, ప్రశాంత్ ప్రణయ్, వెంకటేశ్ వీరంతా కలిసి రూ.10వేల ఆర్థిక సహాయంతోపాటు 50కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ ముష్కం గంగాధర్, గొల్లపల్లి రాము, గొల్లపల్లి శ్రీను, ఇమామ్, తిరుపతి, దేవయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల ఆందోళన

- ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలి
- ఆటో కార్మికులకు రూ.15 వేలు అందజేయాలి
- ఆర్డీవోకు వినతి పత్రం అందజేత



ఆర్డీవో వినతి పత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు

వేములవాడ రూరల్, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ఉచిత ప్రయాణం రద్దు చేయాలని కోరుతూ ఆటో కార్మికులు వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించటం వల్ల మా ఆటోలు ఎవ్వరూ ఎక్కడం లేదన్నారు. దీంతో మాకు ఉపాధి కరువైందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం నిలిపివేయాలని, అలాగే ఆటో కార్మికుల జీవనోపాధికి ప్రతినెలా రూ.15 వేల అందజేయాలన్నారు. దాదాపు అర గంట పాటు తిప్పాపూర్ బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి వేములవాడ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు బత్తుల దేవరాజు, నాయకులు సలీం, కమలాకర్, పాషా, 100 మంది కార్మికులు పాల్గొన్నారు.

# సర్కారు బడిలోనే సకల వసతులు



చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

వేములవాడ రూరల్, డిసెంబర్ 16 : సర్కారు బడుల్లో సకల సదుపాయాలు, నాణ్యమైన విద్యను అందజేస్తున్నామని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలలో అమలవుతున్న ఉన్నతి లక్ష్యాలు, ఉపాధ్యాయులు బోధనలో అనుసరిస్తున్న పాఠ్య ప్రణాళికలు, ఉపాధ్యాయుల డైరీ, సాధన పరీక్షలు, విద్యార్థుల పరీక్షా ఫలితాలు, వివిధ రకాల రికార్డులను పరిశీలించామన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ పద్మజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



సినారె కళామందిర్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి తదితరులు

వేములవాడ రూరల్, డిసెంబర్ 16 : వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో వేములవాడ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు జరగగా మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ, క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని, ఐక్యక్రిస్మస్ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ముందుగా ఆట పాటలతో వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రెండు మిద్దెల విజయ, కోఆప్షన్ సభ్యురాలు నీరెటి సువర్ణ, నాయకులు సలీం, సంఘస్వామి, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, పాస్టర్లు మోజెస్, పహరోను, ప్రసంగి, ప్రకాశ్, క్రిస్‌దాస్‌తో పాటు క్రైస్తవులు పాల్గొన్నారు.

# ఈనెల 19న రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, డిసెంబర్ 16 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి హుండీ లెక్కింపును ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఉదయం 8 గంటలకు ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహిస్తామని, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని వారు తెలిపారు.

# మందుబాబులకు జరిమానా, జైలు

వేములవాడ రూరల్, డిసెంబర్ 16 : వేములవాడ రూరల్ పరిధిలోని డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి కోర్టు జరిమానాతోపాటు జైలుశిక్షను విధించినట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని, దీంతో ఎదురుగా వస్తున్న వారికి కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి గమ్యానికి క్షేమంగా చేరుకోవాలని తెలిపారు. మండలంలోని ఐదుగురికి జరిమానా తోపాటు ఒక రోజు జైలు శిక్షను కోర్టు విధించిందని, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# మహిళ ఆత్మహత్య

రుద్రంగి, డిసెంబర్ 16: రుద్రంగి మండలం అడ్డాబోర్‌తండా గ్రామానికి చెందిన లావుడ్య శీల (30) అనే వివాహిత శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానసిక స్థితి సరిగా లేక లావుడ్య శీల పలుసార్లు ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. శనివారం ఉదయం ఇంట్లో తన భర్త లేచి చూసేసరికి స్టోర్ రూంలోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. శీల భర్త మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. శీలకు కూతురు, కుమారుడు ఉన్నారు.

# గ్రామీణ ప్రాంత కిశోర బాలికలకు శిక్షణ

వేములవాడ, డిసెంబర్16: వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గ్రామీణ ప్రాంత కిశోర బాలికల జీవన నైపుణ్యాల కోసం టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థినులు ఆధునిక ప్రపంచంతో పోటీ పడేలా జీవన నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. అందులో భాగంగా విద్యార్థినులకు సైన్స్ పాఠాలు, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్ వివిధ సబ్జెక్టుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ప్రత్యేక పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. లింగ వివక్ష అంత మొందించడానికి, లింగ సమానత్వం కోసం యవ్వన దశ నుంచే ఏర్పాట్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కేజీబీవీ పాఠశాలలో నూతన ఒరవడితో ఈ ల్యాబొరేటరీలు స్థాపించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల మెటీరియల్‌ను విద్యార్థుల కోసం తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేశ్ కుమార్, సీడీపీవో సుచరిత, పద్మజ, రోజా, స్వర్ణలత, తదితరులు ఉన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కొడిమ్యాల, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శనివారం నాలుగో రోజు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, ఆలయంపైన సుదర్శన చక్రం (శిఖర) ప్రతిష్ఠ చేశారు. సహస్ర దీపాలంకరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జగన్నాథం విష్ణువర్ధనాచార్యుల బృందం, ఆలయ పూజారి నాగరాజు, రమేశ్, భక్తులు పాల్గొన్నారు. నేటితో ఉత్సవాలు ముగియనుండ గా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

జగిత్యాల రూరల్, డిసెంబర్16: జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన జుర్రు మల్లేశం(55) అనే రైతు శనివారం తన పొలం వద్ద నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. పొలం వద్ద ట్రాన్స్ ఫార్మర్‌కు ఫ్యూజ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. గమనించిన స్థానికులు కరీంనగర్‌కు తరలించగా దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లేశంకు భార్య, నలుగురు కూతుళ్లున్నారు.